క్లుప్తంగా

పాఠశాలకు టీవీ బహూకరణ

నారాయణపేట రూరల్ : మండలంలోని అమ్మిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలకు టీవీని బహూకరించారు. అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా టీచర్ రాధ, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపల్ దేవేందర్‌రెడ్డి దంపతుల మనుమరాలు ఇషిత జన్మదినం సందర్భంగా సొంత డబ్బులతో ఎల్ఈడీ టీవీని కొనుగోలు చేసి ఎంఈఓ గోపాల్‌నాయక్ చేతుల మీదుగా శనివారం బహూకరించారు. అదేవిధంగా 120మంది విద్యార్థులకు ప్యాడ్లు అందించారు. అదేవిధంగా కోటకొండ సరస్వతీ శిశుమందిర్ స్కూల్‌కు రిటైర్డ్ తహసీల్దార్ మద్ది అనంత్‌రెడ్డి రూ.1.5లక్షలతో ఆటవస్తువులు అందించగా, తిర్మలాపూర్‌కు చెందిన చెన్నారెడ్డి రూ.75వేలు ఆర్థికసాయం చేశారు. ఆయా కార్యక్రమాల్లో తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రఘువీర్, హెచ్‌ఎం కిశోర్‌కుమార్, కెంచెశ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

దామరగిద్ద: మండల కేంద్రంలోని జీపీఎస్ పాఠశాలకు చెందిన ఐదోతరగతి విద్యార్థిని నాగేంద్రమ్మ తెలంగాణ రాష్ట్ర క్రీడాపాఠశాలకు ఎంపిక కావడంతో పాఠశాల హెచ్‌ఎం నాగేందర్ శనివారం క్రీడా ఉపాధ్యాయులు వెంకటప్ప విద్యార్థిని సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు నాగేందర్ మాట్లాడుతూ.. విద్యార్థిని నాగేంద్రమ్మ క్రీడా ప్రతిభతో మరింత ఉన్నతస్థానాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయుడు మహేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకరాయుడి ఉత్సవాలు

దామరగిద్ద: మండల కేంద్రంలో కనకరాయ స్వామివారి జాతర ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రావణమాస సందర్భంగా స్వామివారికి పల్లకీసేవ, జల్దిబిందె ఉత్సవాలను నిర్వహించారు. ప్రత్యేక వంటకాలతో చేసిన నైవేద్యాలను సమర్పించి తమమొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళ భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం

మరికల్: భక్తిశ్రద్ధలతో కాశీ విశ్వేశ్వర ఆదిహనుమాన్ రథోత్సవాన్ని శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. మూడో శనివారం జరిగే కాశీ విశ్వేశ్వర ఉత్సవాల సందర్భంగా ముందుగా మరికల్ నుంచి స్వామివారి విగ్రహాలను భజనలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆదిహనుమాన్ ఆలయం వద్ద రథోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించారు.

కేసీఆర్‌ది నిరంకుశపాలన

నారాయణపేట: కేసీఆర్ ప్రభుత్వం పోలీసులను అడ్డంపెట్టుకొని నిరంకుశపాలన సాగిస్తున్నదని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్, ప్రతాప్ ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. శనివారం పీవైఎల్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు.. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన డీఎస్సీపోస్ట్ ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని చెప్పి శాంతియుతంగా ధర్నాలు చేస్తున్న ఉద్యోగుల మీద లాఠీచార్జీ చేసి దొరలపాలన కొనసాగిస్తున్నారన్నారు. ఊట్కూర్ మండలం వల్లంపల్లి శివారులో సర్వేలో 15ఎకరాల భూమిని పేదలకు ఇచ్చిన స్థలాన్ని ప్రభుత్వం ఆ భూములను లాక్కోని పేదలకు ఉండడానికి ఇళ్లను దూరం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆ భూములు పేదలకే చెందుతాయని తీర్పుఇవ్వడంతో లబ్ధిదారులు గుడిసెలు వేసుకుంటే వారిని పోలీసులచే అరెస్టుచేయించడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దు, సలీం, ఆనంద్, ఇస్మాయిల్ , రాము, రవి పాల్గొన్నారు.

ఘనంగా పందిరి హన్మాన్ జాతర

కోస్గి: శ్రావణమాసం సందర్భంగా శనివారం మండలంలోని తోగాపూర్ పరిధిలో పందిరి హన్మాన్ జాతర ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా పలు గ్రామాల ప్రజలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని శ్రీరామకాలనీలో అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాస సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంజుల శ్రీనివాస్ దంపతులతోపాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీల్లో ప్రతిభ

మక్తల్: పట్టణంలోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో రేడియంట్ పాఠశాల విద్యార్థులకు రెండో బహుమతి, బాలికల విభాగంలో రెండో బహుమతి దక్కింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అంజిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బాలరాజురెడ్డి, డైరెక్టర్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన

మక్తల్: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం బొడ్రాయిని ప్రతిష్ఠించారు. ఉదయం నవగ్రహాలు, కలశ పూజ, హోమం వేదపండితులతో ప్రతిష్ఠాపన చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు రాఘవేందర్‌జోషి, కృష్ణయ్యజోషి, మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జున్, నర్సింహ, శ్యామ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి



మరికల్‌లో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పాథర్చేడ్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మరికల్: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం దివగంత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఇందిరగాంధీ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. వ్యవసాయ సంక్షోభాన్ని తన మార్క్‌తో పారద్రోలి రైతును రాజు చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, మండల అధ్యక్షుడు వీరన్న, మొగులప్ప, వీరన్న, శ్రీనివాస్, రాజు, ఆంజనేయులు, సత్యన్న, మల్లేష్, రవి పాల్గొన్నారు.

నర్వ: పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన డా. వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ నియోజవకర్గ సమన్వయకర్త కర్ని గంగాధర్ అన్నారు. శనివారం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా పాథర్చేడ్‌లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు,వంటి ఎన్నో బృహత్తర సంక్షేమ పథకాలను చేపట్టిన ఘనత వైఎస్ఆర్‌కే చెందుతుందన్నారు. నరేందర్, మైబు, రవీందర్‌రెడ్డి, నర్సింహులు, ఖాజా, వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన దీక్ష చేపట్టిన 104 ఉద్యోగులు

నారాయణపేట: 104 ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర నాయకులు ఎదురింటి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ యునైటెడ్ మెడికల్‌అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కువద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ దీక్షలో వారు మాట్లాడుతూ.. 104 ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఏజెన్సీని రద్దుచేసి ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా వేతనాలను అందించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ నర్సింగ్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. నిరసనచేస్తున్న ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని టీడీపీ సీనియర్ నాయకులు ఓంప్రకాశ్, యాబన్నచౌదరి వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటరామరెడ్డి, బలరాం, బాలగోపాల్, సత్యకుమార్, వెంకటేష్, రవికుమార్, రేణుకస్వామి, కృష్ణయ్య, శ్రీకాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, వసంత, రమేష్, ప్రవీణ్‌కుమార్, ఎండీ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

జాతరల సంబురం.. భక్తజనుల పారవశ్యం



మద్దూరు: శ్రావణ మాసంలోని మూడవ శనివారం పురస్కరించుకొని దామ్లతండా దగ్గర ఉన్న తండాలో వెలసిన అంజనేయస్వామి, భూనీడ్‌లో వెలసిన ఆంజనేయస్వామి జాతరకు భక్తులు తరలివచ్చారు. దోరేపల్లి గ్రామంలోని వీరప్ప ఇంటి నుంచి స్వామివారి ప్రతిమతో భారీ ఎడ్లబండ్ల ఊరేగింపు ఆలయానికి చేరుకోగా.. గ్రామస్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తండాలోని బావి వద్ద నీటిని తెచ్చి పూజారులు రాఘవేంద్రచారి, వసంత్‌రావ్ అభిషేకం చేశారు. స్వామివారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

అలాగే, మండలంలోని భూనీడ్ ఆంజనేయస్వామి ఆలయంలో జాతర కనులపండువగా సాగింది. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ తిరుపతిరెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా మిటాయిలు, ఆటవస్తులు కొనుగోళ్లు జరిగాయి.

సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ కమిటీ ఎన్నిక



సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ నూతనకార్యవర్గం ఎన్నిక

నారాయణపేట: తెలంగాణ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల జిల్లా జేఏసీ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర జేఏసీ నాయకులు గంగుల కృష్ణారెడ్డి, సీరటి రాఘవేందర్ నాయుడు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సి.ఎల్లాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా అల్తాఫ్ హుసెన్, ఉపాధ్యక్షుడిగా కె. నరేష్‌గౌడ్, నిరంజన్, రాంరెడ్డి, మహిళ అధ్యక్షురాలిగా పావని, ఉపాధ్యక్షురాలిగా రత్నమాల, కోశాధికారిగా రత్నమాల, సహాయ కార్యదర్శులుగా స్వాతి, నారాయణ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారాయణ పవర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉషెనప్ప, ప్రచార కార్యదర్శులుగా ఆరీఫ్‌ఖాన్, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు ఎల్లాగౌడ్ మాట్లాడుతూ.. తమ ఉద్యోగాలను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, అరుణ, రాజు, వెంకట్రాములు, శ్రీనివాసులు, శివకుమార్, ప్రవీణ్‌కుమార్, మహేష్, అమిన్‌రెడ్డి, నర్సింహులు, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అఖిలపక్షం నాయకులు

నారాయణపేట: పేట సరిహద్దులో ఊట్కూర్ మండలం వల్లంపల్లి శివారులోని 48 సర్వేనంబర్‌లో ఉన్న పట్టా సర్టిఫికెట్ కలిగిన లబ్ధిదారులకు న్యాయం చేయాలని చిట్టెం నర్సిరెడ్డి కాలనీవాసుల తరపున శనివారం సాయంత్రం కలెక్టర్‌కోయ శ్రీ హర్షను అఖిల పక్షం ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానూకూలంగా స్పందిస్తూ పట్టా సర్టిఫికెట్ కలిగిన లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీచ్చినట్లు అఖిలపక్షం నాయకులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీజేపీ సీనియర్ నేత నాగూరావు నామాజీ, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి బి.రాము, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామరెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు ఓంప్రకాశ్, అఖిలపక్షం నాయకులు కాశీనాథ్, నారాయణ, సలీం తదితరులు ఉన్నారు.

గడ్డం సాయిబన్న సేవలు మరువలేనివి



గడ్డం సాయిబన్న ఘాట్ వద్ద పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట: మున్సిపల్ మాజీ చైర్మన్ గడ్డం సాయిబన్న సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత నాగూరావు నామాజీ అన్నారు. శనివారం పట్టణంలోని సాయిబన్న ఘాట్ వద్ద బీజేపీ నాయకులు, అభిమానులు ఆయన వర్ధంతి సందర్భంగా ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా నామాజీ మాట్లాడుతూ.. ఆయన ఆశయ సాధనకు బీజేపీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమేష్, రాఘవేంద్ర, వెంకట్రాములు, మాజీ వైస్ చైర్మన్‌నందు నామాజీ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ, మాజీ కౌన్సిలర్ గోపాల్ యాదవ్, నాయకులు రాము, అంబాదాస్ నగరి, సైదప్పా, వడ్డే దత్తు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్సు నడిపించాలని రాస్తారోకో

దామరగిద్ద: పేటడిపో నుంచి మండల సరిహద్దులోని కర్ణాటక యానుగుంది వరకు ప్రతిరోజూ నడిపించే షటిల్ బస్సులను సక్రమంగా నడిపించాని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మోహన్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కాన్‌కుర్తి ప్రధాన రహదారిపై విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. విద్యార్థులు ఆర్టీసీ బస్‌పాస్‌లు కలిగి ఉన్నారని, షటిల్ బస్సులను సక్రమంగా నడిపించకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తుందన్నారు. అనంతరం డీఎం లక్ష్మీసుధతో ఫోన్లో మాట్లాడగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నితిన్‌గౌడ్, అనిల్, వర్ణమాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాఘవేంద్ర స్వామి రథోత్సవం

నారాయణపేట: స్థానిక పరిమళపురంలో రాఘవేంద్రస్వామి దేవస్థానంలో మహారథోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం రఘుప్రమాచార్ జోషిచే సుప్రభాతసేవ, స్వామివారికి పంచామృతాభిషేకం, వస్త్రసమర్పణ, పుష్పాలంకరణ సేవ నిర్వహించారు. ప్రముఖ విద్యాన్ రమచర్య వారిచే ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. శ్రీ రాఘవేంద్రస్వామి భక్తుల నామస్మరణతో మార్మోగింది. ఉత్సవాల్లో వార్డు కౌన్సిలర్ మేఘా, బ్రహ్మణ సమాఖ్యఅధ్యక్షుడు భీంసెన్‌రావు, శక్తిపీఠం వ్యవస్థాపకులు శాంతనంద్ పురోహిత్, అడ్వకేట్ సీతరామరావు, అనిల్‌కుమార్, నర్సింహ, వెంకటేష్, ప్రసాద్, ప్రకాశ్ పాల్గొన్నారు.

రెండోరోజూ బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన

మద్దూరు: పట్టణంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు రెండోరోజూ కొనసాగాయి. యాగ మండపం కాచువాగు శివాలయం వద్ద మాన్యసూక్త హోమం, నవగ్రహోమం, మహా మంగళహారతి వేద పండితులు రాఘవేంద్రచారి ఆధ్వర్యంలో ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ వెంకటయ్య, ఉపసర్పంచ్ యాదవరెడ్డి దంపతులు హోమాలు నిర్వహించారు. అనంతరం బొడ్రాయిలకు ధాన్యభివాసం చేశారు. అనంతరం బొడ్రాయిలు పునఃప్రతిష్ఠించే స్థలాల్లో ఊరేగింపుగా నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని శనివారం తిరుమలేశుని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించారు. ఆయా కార్యరక్రమాల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, రాంరెడ్డి, శివరాజ్, శ్రీశైలం, మల్లికార్జున్, రాములు పాల్గొన్నారు.

ఘనంగా జల్దిబిందె మహోత్సవం

మాగనూర్: మండల కేంద్రంలో లక్ష్మీనరసింహ స్వామి వారి జల్దిబిందెమహోత్సవం శనివారం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా శనివారం గ్రామం నుంచి స్వామివారిని పల్లకీలో ఊరేగింపుగా కృష్ణానదికి తీసుకెళ్లి అక్కడ నదిలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం స్వామివారిని ఆలయానికి చేర్చారు. అదేవిధంగా ఓబ్లాపూర్ గ్రామస్తులు జల్దిబిందే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఊట్కూరు: వర్షాలు సమృద్ధిగా కుర్వాలని పగిడిమారిలోని ఆంజనేయస్వామి ఆలయంలో కృష్ణానది నుంచి తెచ్చిన నీటితో భక్తులు శనివారం జలాభిషేకం చేశారు. ఆంజనేయస్వామి ఆలయంలో వర్షాలు కురువాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సులోచన, మురళీధర్‌రెడ్డి, బసవరాజుగౌడ్, గోపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విష్ణుమూర్తిగౌడ్, రాఘవేంద్ర, తిరుపతి, బీరప్ప పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



పట్టణ పీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

నారాయణపేట రూరల్: శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే పోలీసుల ధ్యేయమని డీఎస్పీ కే.సత్యనారాయణ అన్నారు. పట్టణ పీఎస్‌ను శనివారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల వివరాలు, ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసుకు సంబంధించిన ప్రతి ఆధారాన్ని సంపాదించి, నేరస్తులకు కోర్టు ద్వారా తగిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి విషయాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నేరాల కట్టడికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాల భారిన పడకుండా యువత, గ్రామీణ ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని, డయల్ 100 ఫిర్యాదులను వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. పెట్రోలింగ్ విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని, నిశేధిత వస్తువుల విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్‌యాక్ట్ బుక్కులను తరుచుగా చదువుతూ ఉండాలన్నారు. ఆత్మహత్య కేసులు అన్ని కోణాల్లో పర్యవేక్షించాలని, 5ఎస్ అమలుకు తగిన సూచనలు చేస్తూ పీఎస్ పరిశుభ్రత, ఫైల్స్ క్రమ పద్దతిలో ఏర్పాటు చేసే విధంగా కిందిస్థాయి సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. ప్రతీ వార్డు, గ్రామంలో సీసీ కెమరాలు ఏర్పాటుచేసుకునేలా చూడాలన్నారు. సీఐ రావిబాబు, ఎస్ఐలు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి



పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు: సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కొత్తపల్లి మండలంలోని గొర్లోనిబాయి, కిషన్‌నగర్ గ్రామాల్లో హైమాస్ట్ లైట్లను, తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో జరుగని అభివృద్ధి తెలంగాణలో జరిగిందని గుర్తుచేశారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రలో అమలు చేయడానికి ఆయా రాష్ట్రాల అధికారులు ఇక్కడికి వచ్చి అధ్యాయనం చేస్తున్నారని గుర్తుచేశారు. రాబోవు ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్ సర్కార్‌ను అధికారంలో తీసుకురావాలని కోరారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్ వెంకటేష్, మణెమ్మ, షేక్ మీరాన్, రైతు సమన్వయసమితి అధ్యక్షుడు మధుసుధన్‌రెడ్డి, పార్టీ నాయకులు మల్లేష్, రఘు, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ఓటరుగా నమోదు చేసుకోవాలి



కోస్గిలో కిట్లను పంపిణీ చేస్తున్న తహసీల్దార్

కోస్గి:18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆదేశాల సందర్భంగా శని, ఆదివారాల్లో రెండురోజులపాటు నిర్వహిస్తున్న ఓటునమోదులో భాగంగా శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. నూతన ఓటర్ల జాబితాకు సంబంధించి అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని, ఎలాంటి తప్పులు లేకుండా సరియైనా ఓటర్ల జాబితాను తయారు చేసేలా చూడాలని బీఎల్ఓలకు సూచించారు. అంతకుముందు ఎన్నికల కమిషన్ ద్వారా అందజేసిన బీఎల్ఓల కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుభాష్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బుగ్యా సాబ్, బీఎల్ఓలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరికల్: ఈవీఎం మిషన్‌లో ఓటువేసే విధానంపై రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం మరికల్, జిన్నారం గ్రామాల్లో ఈవీఎం మిషన్‌లో ఓటువేసే విధానంపై ఆర్ఐ శ్రీశైలం ప్రజలకు వివరించారు. అలాగే 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కును పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటువేసేవిధానంపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతోనే ఎన్నికల కమీషన్ ఈ పక్రియ చేపట్టిందని తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ధన్వాడ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలో రాణించాలని గోటూర్ సర్పంచ్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలను స్థానిక గోటూర్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఇందులో అండర్ 14 నుంచి 17 వరకు బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడాపోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులకు మాజీ వైస్ ఎంపీపీ ఉదయభాను క్రీడా దుస్తులను శనివారం అందజేశారు. విద్యార్థులు క్రీడాలో రాణించి మండలానికి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో పీడీ నెల్సన్‌కుమార్, పీఈటీలు వెంకటేష్, సాయినాథ్, రవికుమార్, రామ్మోహన్, మోలాలి, పారిజాత, సుగుణాకర్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

కోస్గి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 4, 5వ తేదీల్లో మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించడంతోపాటు ప్రతిభచూపిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు పీడీ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 4న అండర్-14 విభాగంలో, 5న అండర్-17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయులు వెలికితీయాలని రిసోర్స్ పర్సన్లు అధికారులు నరేందర్, లక్ష్మణ్ అన్నారు. శనివారం మండలంలోని బైరంపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులకు వెలుగు అభ్యాసమిత్రలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించి వెలుగు అభ్యాసమిత్ర కార్యక్రమాన్ని సూచనల ప్రకారం నడుచుకోవాలని, ప్రతి పాఠశాలలో సీ గ్రేడ్ విద్యార్థుల సంఖ్యను తగ్గించాలన్నారు. జాలిఫోనిక్స్ విధానాన్ని పాఠశాలలో ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమం ద్వారా పాఠశాలలు బలోపేతం కావాలని, ఇందుకుగాను ఉపాధ్యాయులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, విద్యావలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



హెచ్‌ఎం మల్లేష్‌కు నగదును అందజేస్తున్న దండు అయ్యప్ప



ఆర్థిక సాయం అందజేస్తున్న డీకె అరుణ

నర్వ: మండలంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకులు దండు అయ్యప్ప టై, బెల్టు, ఐడీకార్డుల కోసం శనివారం రూ. 15వేలు ఆర్థికసాయాన్ని హెచ్‌ఎం మల్లేష్‌కు అందజేశారు. ఈ మేరకు నిరుపేద విద్యార్థులు మెరుగ్గా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం హెచ్‌ఎం మల్లేష్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నిలయాలైన ప్రభుత్వ బడులకు దాతలు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి చేరాలి

ధన్వాడ: విద్యార్థులు చదువులో మంచిప్రతిభ చూపించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నతపాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలో నిర్మిస్తున్న సరస్వతీ భవనానికి రూ.25వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమేష్, బీజేపీ నాయకులు ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.

రైతు చైతన్య సదస్సు పోస్టర్ విడుదల

మరికల్: ఈ నెల 4న పేట జీపీశెట్టి ఫంక్షన్ హాల్‌లో జరిగే రైతుచైతన్య సదస్సుపోస్టర్లను కన్వీనర్ కృష్ణయ్య మండలంలోని శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుబడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలని, విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలన్నారు. ప్రతి పంటకు బీమా, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయే రైతులను నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలన్నారు. సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భద్రాద్రి, యాదగిరి పాల్గొన్నారు.